42శాతం ఇవ్వాల్సిందే!

- రిజర్వేషన్లపై బీసీ జేఏసీ నేతల డిమాండ్
- రాష్ట్ర బంద్ విజయవంతం



బోధన్‌లో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న బీసీ సంఘాల జేఏసీ, అఖిల పక్ష నాయకులు

సాక్షి నెట్‌వర్క్: బీసీల 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని బీసీ సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం బీసీ సంఘాలు, అఖిలపక్షాల పార్టీలు ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్ర బంద్ విజయవంతమైంది. ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాలోని అన్ని మండలాలు, గ్రామాల్లో బంద్ ప్రశాంతం, సంపూర్ణంగా జరిగింది. వివిధ వ్యాపార వాణిజ్య దుకాణాలు, హోటళ్లు, పెట్రోల్ బంక్ నిర్వాహకులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని, మద్దతు తెలిపారు. అలాగే ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థలను మూసివేయించారు. బీసీ సంఘాల నాయకులు ఉదయం నుంచే బోధన్, ఆర్మూర్ ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. దీంతో బస్సులు డిపో నుంచి బయటకు రాలేవు. బస్టాండ్లల్లో ప్రయాణికులు లేక వెలవెలబోయాయి. పలు మండలాల్లో నాయకులు బైక్ ర్యాలీ, ధర్నా, రాస్తారోకోలు నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్దత కల్పించాల్సిందేనని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లను సాధించుకునేందుకు సంఘటితంగా ముందుకెళ్లాలని పిలుపు నిచ్చారు. బంద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.





డొంకేశ్వర్‌లో ఎంపీవోకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు.. బోధన్‌లో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ సంఘాల జేఏసీ ప్రతినిధులు.. ఆర్మూర్ పట్టణంలో..



బోధన్ ఆర్టీసీ డిపోలో నిలిచిపోయిన బస్సులు



కమ్మర్‌పల్లిలో రాస్తారోకో చేస్తున్న నాయకులు



వర్నిలో మూసిఉంచిన దుకాణ సముదాయాలు





ఆర్మూర్‌లో దుకాణాలను బంద్ చేయిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు.. బాల్కొండలో కళాశాలను మూసివేయిస్తున్న కాంగ్రెస్ నాయకులు.. రెంజల్ హైస్కూల్‌ను..



ఎడపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు..



మాక్లూర్‌లో..



నందిపేటలో..



రుద్రూర్‌లో..



భీమ్‌గల్‌లో..



మోర్తాడ్‌లో..

క్లుప్తంగా

పక్కదారి పడుతున్న 'ఇందిరమ్మ ఇళ్ల' ఇసుక

మాక్లూర్: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం కేటాయించిన ఇసుకను అక్రమార్కులు వేరే వాటికి తరలిస్తున్నారు. మండలంలోని వల్లభాపూర్ ఇసుక క్వారీ నుంచి 16 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను ఇందిరమ్మ ఇళ్ల కోసం మాక్లూర్ తహసీల్దార్ శేఖర్ అనుమతి ఇచ్చారు. వాటిలో వల్లభాపూర్‌కు 8 ట్రాక్టర్లు, మెట్‌పల్లికి 8 ట్రాక్టర్లు మొత్తం 16 ట్రాక్టర్లకు వేబిల్లులు ఇచ్చారు. కానీ శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 10 ట్రిప్పుల ఇసుక రవాణా జరిగినట్టు తెలిసింది. కొందరు ట్రాక్టర్ యజమానులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఇసుక రవాణ చేసినట్టు సమాచారం. ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా తాను మెట్‌పల్లి, వల్లభాపూర్‌కు కలిపి 16 ట్రాక్టర్ల ట్రిప్పులకు మాత్రమే అనుమతి ఇచ్చినట్టు తెలిపారు. ఆర్ఐ షఫీ, జీపీవోను ఇసుక పక్కదారి పట్టకుండా క్వారీ వద్ద ఉంచామన్నారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి



ఆర్మూర్: గర్భిణులు, బాలింతలు పాలు, పండ్లు, ఆకు కూరల లాంటి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నళిని సూచించారు. పట్టణంలోని వడ్డెర కాలనీలోగల అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ్ మాసోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. సిబ్బంది శోభారాణి, లక్ష్మి, రంగాచారి నగర్, అరుంధతి నగర్ కాలనీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గానికి సన్మానం



ఆర్మూర్: ఎన్‌పీడీసీఎల్ కంపెనీ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు ఇటీవల జరుగగా, నూతన కార్యవర్గం ఏర్పాటైంది. రాష్ట్ర అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీగా గోపాల స్వామి, వైస్ ప్రెసిడెంట్‌గా నర్సయ్య, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా సురేష్ బాబు ఎన్నికయ్యారు. ఈసందర్భంగా రాష్ట్ర నూతన కమిటీకి ఎన్నికైన ప్రతినిధులను శనివారం ఆర్మూర్‌లోని 1104 యూనియన్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. యూనియన్ ప్రతినిధులు సంజీవ్, నరేందర్ నాయక్, ప్రదీప్‌గౌడ్, గంగారాం, నాగభూషణం, వేణుగోపాల్, సుధాకర్, శివ, లక్ష్మణ్‌గౌడ్, మహిపాల్ పాల్గొన్నారు.

బోధన్ బల్దియా తనిఖీ



బోధన్‌టౌన్: బోధన్ (మున్సిపల్)బల్దియా కార్యాలయాన్ని శనివారం అదనపు కలెక్టర్ అంకిత్, సబ్ కలెక్టర్ వికాస్ మహతో సందర్శించారు. ఈసందర్భంగా కులాయి బిల్ కోసం పట్టణ ప్రజలు కట్టిన రసీదులతో పాటు బల్దియా కార్యాలయంలోగల రెండవ ప్రతిని పరిశీలించారు. అనంతరం కులాయి బిల్లులు బుక్కుల పరిశీలనకు సిద్ధంగా ఉంచాలని సూచించారు. 2017 నుంచి ఇప్పటి వరకు ఆన్‌లైన్ కాని బిల్లులు ఆన్‌లైన్ చేయాలని ఏవైన టెక్నికల్ సమస్యలు ఉంటే సీడీఎంఏ దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. అనంతరం పట్టణ శివారులోగల డంపింగ్ యార్డును అదనపు కలెక్టర్ అంకిత్ తనిఖీ చేశారు. పట్టణంలోని శక్కర్ నగర్ చౌరస్తాతోపాటు ఇతర చోట్లలో తాగునీటి లీకేజీలు అరికట్టేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

ఆర్ఎస్ఎస్ పద సంచలన్



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో శనివారం సాయంత్రం రాష్ట్రీయ స్వయం సేవక్ ఆధ్వర్యంలో పద సంచలన్ నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని కమ్మర్‌పల్లి, మోర్తాడ్, ఏర్గట్ల మండలాల స్వయం సేవకులు గణవేష్, పదవేష్, టోపీ ధరించి, దండంతో కమ్మర్‌పల్లి బస్టాండ్ నుంచి రాజీవ్‌గాంధీ విగ్రహం, పోచమ్మ గల్లీ, పోస్టాఫీస్, హసకొత్తూర్ రోడ్, జాతీయ రహదారి, భరతమాత విగ్రహం మీదుగా బస్టాండ్ వరకు పద సంచలన్ నిర్వహించారు.

బై బ్యాక్‌కు బై.. బై..

- గతంలో జొన్న రైతులకు ఒప్పందంతో విత్తనాలు సరఫరా చేసిన వ్యాపారులు
- ప్రస్తుతం విత్తనాల ఖరీదుతో అందజేత



బాల్కొండ: వాణిజ్య పంట అయిన ఎర్ర జొన్న పంటలో రైతులతో వ్యాపారులు బై బ్యాక్ ఒప్పందం చేసుకోకుండానే విత్తనాలను సరఫరా చేస్తున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. గతంలో విత్తనాలు సరఫరా చేసే వ్యాపారే పంట దిగుబడిని కొనుగోలు చేసేల ఒప్పందం చేసుకునే వారు. ఎకరానికి 20 క్వింటాళ్లు రాసిచ్చేవారు. ప్రస్తుతం అవన్ని లేకుండానే వ్యాపారులు విత్తనాలను రైతులకు సరఫరా చేస్తున్నారు.

ధర ఉండదని ప్రచారం..

ప్రస్తుత సంవత్సరం ఎర్రజొన్న పంటకు అంతగా ధర ఉండదని వ్యాపారులు ప్రచారం చేశారు. దీంతో రైతులు అధిక శాతం మక్క పంట సాగు వైపు దృష్టిసారించారు. కాని కొందరు రైతులు నీటి సాకర్యం తక్కువగా ఉండటం, మక్క పంటకు ఎక్కువ శ్రమ ఉండటంతో జొన్న పంట సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఈక్రమంలో వ్యాపారుల వద్ద ఎకరం విత్తనాలకు రూ.800 చెల్లించి రైతులు తీసుకెళ్తున్నారు. దీంతో దుకాణంలో విత్తనాలు విక్రయించినట్లే విక్రయిస్తున్నారు. దిగుబడి రాకుంటే బాధ్యులు ఎవరో కూడ తెలియడం లేదు. ప్రభుత్వం పట్టించుకుని ఎర్రజొన్న రైతులు మోసపోకుండా చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

అధికారులు స్పందించాలి..

ప్రస్తుత సంవత్సరం ఎర్ర జొన్నలకు ధరనే ఉండదని అంటున్నారు. ఎక్కడ ఎలాంటి ఒప్పందం లేకుండానే వ్యాపారులు విత్తనాలను సరఫరా చేస్తున్నారు. తక్కువ పెట్టుబడితో సాగుచేసే పంట కావడం వల్ల ఎర్ర జొన్న పంటనే సాగు చేయుటకు కొందరం రైతులం మొగ్గు చూపుతున్నాం. అధికారులు స్పందించి, బై బ్యాక్ ఒప్పందం ఉండేలా చర్యలు తీసుకోవాలి.

–గంగారెడ్డి, రైతు, బాల్కొండ

వరి కోతల్లో జాగ్రత్తలు తప్పనిసరి!



భీమ్‌గల్‌లో వరి కోతలపై అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు

- నాణ్యమైన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించాలి
- రైతులు, హార్వెస్టర్ నిర్వాహకులకు అధికారుల సూచన

మోర్తాడ్(బాల్కొండ) : కొనుగోలు కేంద్రాలకు తరలించే వరి ధాన్యం నాణ్యతా ప్రమాణాలతో ఉండాలంటే కోతల సమయంలోనే తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికార యంత్రాంగం సూచిస్తోంది. ప్రస్తుతం వరి కోతలు ప్రారంభమైన నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు వరి కోత యంత్రాల యజమానులు, డ్రైవర్లకు, అలాగే రైతులకు తగు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. తాలు, ఇతర వ్యర్థాలు ధాన్యంలో చేరితే రైస్‌మిల్లర్లు తరుగు తీసే అవకాశం ఉంది. ఇందుకోసం కోతల సందర్భంలోనే నిర్దిష్టమైన విధానం అవలంభించాలని అధికారులు చెబుతున్నారు.

పూర్తి పక్వానికి వచ్చిన తర్వాతే..

జిల్లా వ్యాప్తంగా వర్షాకాలం సీజనుకు గాను 5.50లక్షల ఎకరాలకుపైగా వరి ధాన్యం సాగు చేశారు. కోతలు కొన్ని చోట్ల పూర్తి కావస్తుండగా 75 శాతం వరకు కోతలు చేపట్టాల్సి ఉంది. వరి చేను పూర్తిగా పక్వానికి వచ్చిన తర్వాతనే కోతను మొదలు పెట్టాలి. అలాగే కోత యంత్రం ఆర్‌పీఎం 19–20గా ఉండేలా చూడాలని అధికారులు సూచిస్తున్నారు. గేర్ స్పోట్ ఏ2 నుంచి బీ1లో పెట్టి కోతను కొనసాగించాలని అధికారులు చెబుతున్నారు. వరి కోసే సమయంలో యంత్రం బ్లోయర్(ఫ్యాన్) ఆన్‌లో ఉంటే తాలు వచ్చే అవకాశం ఉండదని అధికారులు చెబుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..

వరి కోతలు కొనసాగుతున్న చోటకు వెళ్లి యంత్రాల యజమానులు, డ్రైవర్లకు కోతల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం. జాగ్రత్తలు తీసుకుంటే నాణ్యమైన ధాన్యంను కొనుగోలు కేంద్రాలకు తరలించడానికి అవకాశం ఉంది. వరి సేకరణకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

–లావణ్య, వ్యవసాయాధికారిణి, భీమ్‌గల్

సంక్షిప్తం

బీమా చెక్కు అందజేత



వర్ని: మండలంలోని జలాల్పూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ గౌస్ ఇటీవల మృతి చెందాడు. మృతుడికి గతంలోనే ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకంలో బీమా చేసుకున్నాడు. దీంతో మృతుడి భార్యకు శనివారం బీమా చెక్కును ఎస్బీఐ మేనేజర్ కిషోర్ అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు..



వేల్పూర్: మండలంలోని రామన్నపేట్, మోతె గ్రామాలలో పలు బాధిత కుటుంబాలకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం స్థానిక కాంగ్రెస్ నాయకులు అందజేశారు. నాయకులు శోభన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, హరీష్‌గౌడ్, లింబారెడ్డి, భువనేశ్వర్, చిన్న గంగారెడ్డి, భగవాన్ దాస్, సురేష్, రాజేందర్, రాజేశ్వర్, రవికాంత్, మదన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం



బాల్కొండ: మండల కేంద్రంలోని దాస్ హనుమాన్ మందిరం, గుట్టమీది హనుమాన్ మందిరంలో శనివారం భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టారు. ఈసందర్భంగా భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎన్నికల ప్రచారంలో కమ్మర్‌పల్లి బీఆర్ఎస్ నేతలు



కమ్మర్‌పల్లి: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో కమ్మర్‌పల్లి బీఆర్ఎస్ నాయకులు పాల్గొని ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు బద్దం చిన్నారెడ్డి, మైలారం సుధాకర్, బద్దం రాజశేఖర్‌రెడ్డి, అహ్మద్, కొంటికంటి నరేందర్ తదితరులు శనివారం షేక్ పేట్ డివిజన్‌లో ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు.

రుద్రూర్ ఎంపీడీవోగా బాల గంగాధర్

రుద్రూర్: రుద్రూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బాల గంగాధర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ భీమ్‌గల్ సూపరింటెంట్ భీమ్‌రావ్ డిప్యూటేషన్‌పై ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వర్తించారు. భీమ్‌రావ్ పాత స్థానానికి వెళ్లిపోగా ముప్కాల్ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న బాల గంగాధర్ రుద్రూర్‌కు వచ్చారు.

జోనల్‌స్థాయి పోటీల్లో ప్రతిభ



బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్ గురుకుల పాఠశాల విద్యార్థులు అండర్–17 జోనల్ స్థాయి కబడ్డీ పోటీల్లో సత్తా చాటి ప్రథమ స్థానం సాధించారు. ముప్కాల్ మండల కేంద్రంలో శనివారం జోనల్ స్థాయి పోటీలు జరుగగా, విద్యార్థులు నిక్షిత్‌రాజు, సాయిచరణ్, లక్ష్మణ్, రాంచరణ్ ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ సురేందర్, ఉపాధ్యాయులు అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం



బోధన్: ఎడపల్లి మండలం ఠాణాకలాన్ గ్రామ శివారులో శనివారం లింగారెడ్డి అనే రైతు పొలంలో గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి, రాగి తీగలు, ఇతర పరికరాలను చోరీ చేశారు. మూడేళ్ల కాలంలో ఇదే రైతు పొలంలో ఐదుసార్లు ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైందని స్థానికులు తెలిపారు. రెండు రోజుల క్రితం పోలీస్, విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలను నిలువరించేందుకు ట్రాన్స్‌ఫార్మర్లకు వెల్డింగ్ చేయించే పనులు చేపట్టారు. కాని దుండగులు మాత్రం అధికారుల నిఘా నుంచి తప్పించుకుని చోరీలకు పాల్పడుతున్నారు.

వరి, మక్క కొనుగోలు కేంద్రాల ప్రారంభం



ఆర్మూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్మూర్ మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్



పచ్చలనడ్కుడ సొసైటీలో..



చేంగల్ గ్రామంలో..

ఆర్మూర్/పెర్కిట్/వేల్పూర్/కమ్మర్‌పల్లి: పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆర్మూర్ మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్ ప్రారంభించారు. వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ సొసైటీలో మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ శ్రీకాంత్, సొసైటీ చైర్మన్ లింబారెడ్డి ప్రారంభించారు. అలాగే ఆలూర్‌లో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని వైస్ చైర్మన్ రాజేశ్వర్ ప్రారంభించారు. భీమ్‌గల్ మండలం చేంగల్ గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మక్కల కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ షబ్బీర్, ఏవో లావణ్య ఇతర అధికారులు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏ రకం వరి క్వింటాలుకు రూ.2,399, బీ రకం వరికి రూ.2,369 మద్దతు ధరను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. సన్న వడ్లకి రూ.500ల బోనస్‌ను సైతం ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కొనుగోలు కేంద్రాలను రైతులు ఉపయోగించుకొని మద్దతు ధర పొందాలన్నారు.




ఆలూర్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ వైస్ చైర్మన్ రాజేశ్వర్.. నవీపేట్ మండలంలో..

పశువులకు టీకాలు వేయించాలి



పోచంపల్లిలో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

వేల్పూర్: రైతులు తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పని సరిగా వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ గంగాధరయ్య అన్నారు. వేల్పూర్ మండలం పోచంపల్లిలో శనివారం నిర్వహించిన గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సురేష్, గంగాధర్, దయానంద్, వీడీసీ సభ్యులు, పాడి రైతులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆర్మూర్ సి. ప్రభాకర్ ACO : 9010585333
నిజామాబాద్ అర్బన్ జి. రాంనాథ్ : 9849180084
నిజామాబాద్ రూరల్ ఎం. రాజేంధర్ : 9966958559
బాల్కొండ ప్రవీణ్ : 7893150102
బోధన్ ఎ.శివ : 9848956776
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899